ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

శుక్రవారం 29 నవంబరు 2024



న్యూస్ బాక్స్

జిల్లా ప్రజానాట్యమండలి నిర్మాణ కమిటీ

సిరిసిల్ల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజానాట్యమండలి నిర్మాణ కమిటీని ఏర్పాటు చేశామని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ ప్రకటించారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా నాట్యమండలి నిర్మాణ కమిటీని ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణతోపాటు ప్రజలు, రైతులు, కార్మికులు, శ్రామికుల హక్కుల గొంతుకగా పోరాడడానికి ఏర్పాటు చేశామన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజానాట్య మండలి జిల్లా కన్వీనర్‌గా మిట్టపల్లి రాజమల్లు, కో-కన్వీనర్‌గా తన్నీరు లక్ష్మీరాజం, కమిటీ సభ్యులుగా బోడ బాలలింగం, బైతి లిఖిత, వేముల రామస్వామి, మాట్ల శ్రీనివాస్, శ్రీరాం సదానందం, రమేష్‌చంద్ర శ్రీరాములను నియమించారు.

ఎస్పీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయం కొత్త భవనంలోకి మారిన సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను బీఆర్ఎస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దీక్షా దివస్ నిర్వహణపై చర్చించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు జిందం చక్రపాణి, రాఘవరెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

చలి లెక్క పక్కా..



- జిల్లాలో 21 వెదర్ స్టేషన్ల ద్వారా లెక్కింపు
- టీజీడీపీఎస్‌లో జిల్లాస్థాయి కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతల నమోదు
- వారం రోజులుగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- జిల్లాలో 11.2 కనిష్ట ఉష్ణోగ్రత



జిల్లాలోని వేదర్ స్టేషన్లు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

చలి వణికిస్తోంది... వారం రోజులుగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు 10.3 డిగ్రీల నుంచి 11.2 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. రోజురోజుకు జిల్లాలో ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో వాతావరణశాఖ జిల్లాను ఎల్లోఅలర్ట్ జోన్‌గా ప్రకటించింది. అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తోంది. ఎండాకాలంలో నిప్పులు చెరుగుతున్న సూర్యుని ప్రతాపాన్ని చలికాలంలో వణికిస్తున్న ఉష్ణోగ్రతలను పక్కాగా వాతావరణ శాఖ లెక్కిస్తుంది. ప్రస్తుతం గురువారం జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత 11 డిగ్రీలకు పడిపోయింది. దీంతో జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లో ఎనిమిది గంటలకే జన సంచారం తగ్గి నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం వేళల్లో 9 గంటల వరకు కూడా రోడ్లపైన జనాలు కనిపించడం లేదు. చలితీవ్రత మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. చలి తీవ్రతను లెక్కించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా వెదర్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. దీంతో పాటు వివిధ యాప్‌లు కూడా అందుబాటులోకి వచ్చినా తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీజీడీపీఎస్) లెక్క పక్కాగా ఉంటుంది.

● **చలి మండలానికో తీరు..**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో చలిని ఆటోమెటిక్ వెదర్ స్టేషన్‌ల ద్వారా నిరంతరం అధికార యంత్రాంగం లెక్కిస్తుంది. కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతలను మండలాల వారీగా నమోదు చేస్తారు. ప్రస్తుతం జిల్లాలో 11డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదవుతోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో, మండలాల్లో ఉష్ణోగ్రతల్లో తేడాలు ఉంటాయి. జిల్లాలో 21 వెదర్ స్టేషన్‌లు ఉన్నాయి. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో సిరిసిల్ల పట్టణం, పెద్దూర్, కోనరావుపేటలో మర్తనపేట, చందుర్తిలో మర్రిగడ్డ, వేములవాడ రూరల్‌లో వట్టెంల, మల్లారం, వీర్నపల్లి మండలంలో వీర్నపల్లి, తంగళ్లపల్లి మండలంలో నేరేళ్ల ఇల్లంతకుంట మండలంలో కందికట్కూర్, ఇల్లంతకుంట, పెద్దలింగాపూర్, ముస్తాబాద్ మండలం అవునూర్, నామాపూర్, వేములవాడ మండలంలో నాంపల్లి, కోనరావుపేట మండలంల నిజామాబాద్, రుద్రంగి మండలంలో రుద్రంగి, మానాల, గంభీరావుపేట మండలంలో గజసింగవరం, గంభీరావుపేట, బోయినపల్లి మండలంలో బోయినపల్లి, ఎల్లారెడ్డిపేట మండలంలో..

-మిగతా 8లో



రూ. 50 లక్షలతో ఐదు ట్రాక్టర్లు కొనుగోలు

- మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి

ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

8



ఆలయాల్లో భక్తుల రద్దీ

- వేములవాడలో దీపాలు వెలిగించిన మహిళలు

రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

6

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

రుద్రంగి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రుద్రంగి మండల కేంద్రంలో సాంస్కృతిక సారథి కళా బృందం ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రంగితో పాటు మానాల, బడితండా గ్రామాల్లో కళాజాతా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, యువతకు ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళకారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ పరామర్శ

రుద్రంగి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మానాలలో చంద వంశీ, రుద్రంగికి చెందిన సామ నారాయణ, జోగినిపల్లి సత్తవ్వ, ఓద్యారపు మోహన్, మోతె వెంకటి, బోండ్ల రాయనర్సయ్య ఇటీవల వివిధ కారణాలతో మరణించగా వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి ఉన్నారు.

వంద పట్టణాల్లో డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ ఏర్పాటు

- కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ మనోజ్ జోషి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేశంలోని వంద పట్టణాల్లో ముందస్తుగా పైలెట్ ప్రాజెక్టు కింద డిజిటల్ ల్యాండ్ రికార్డులు ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ దిశగా అధికారుల అవసరమైన కార్యాచరణను అమలు చేయాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ మనోజ్‌జోషి అన్నారు. గురువారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ నక్షా (నేషనల్ జియో స్పెషియల్ నాలెడ్జ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్స్) పై దేశంలోని వివిధ రాష్ట్రాల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్ మాట్లాడుతూ డిజిటల్ ఇండియాలో భాగంగా భూ రికార్డులను డిజిటలైజ్ చేసి నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ముందస్తుగా వంద పట్టణాల్లో నక్షా కార్యక్రమం పైలట్ కింద అమలు చేస్తున్నామని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో నక్షా కార్యక్రమ అమలు కోసం నోడల్ అధికారిని ప్రత్యేకంగా నియమించి, వారి కాంటాక్ట్ వివరాలు అందజేయాలని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో భూ రికార్డులు డిజిటల్ చేసేందుకు వీలుగా అవసరమైన సిబ్బంది, కార్యాలయాలు, సామగ్రి ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. ప్రతిరాష్ట్రంలో రాష్ట్రస్థాయి నక్షా కమిటీలు ఏర్పాటు చేయాలని అన్నారు. రాష్ట్రంలో ఎంపిక చేసిన అర్బన్ ప్రాంతాల్లో భూ రికార్డుల సర్వే కోసం క్షేత్రస్థాయిలో అవసరమైన బృందాలు సర్వేయర్లు, వాహనాలు, సామగ్రి మొదలగు ఏర్పాట్ల ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ఆస్తి పన్ను, ఇతర పన్ను వసూళ్లకు సంబంధించిన రికార్డుల సహాయంతో భూముల సర్వే ప్రక్రియ చేపట్టాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ జిల్లాలో వేములవాడ పట్టణం, నాంపల్లి తిప్పాపూర్, శాత్రాజుపల్లి, సంకేపల్లి గ్రామాల్లో భూ రికార్డులకు సంబంధించి రీసర్వే చేసి వివరాలను డిజిటల్ చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, డీఆర్‌డీవో శేషాద్రి, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, టౌన్ ప్లానింగ్ అధికారి అన్సర్, ఏడీ ల్యాండ్స్ అండ్ సర్వే రికార్డ్స్ బాలచందర్, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారిపై చర్యలు

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సిరిసిల్ల సబ్ డివిజన్ పోలీసు అధికారులతో నేర సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతీ కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ద్వారా నేరస్థులకు శిక్ష పడే విధంగా చేసి బాధితులకు న్యాయం చేయాలన్నారు. కేసుల విచారణలో జాప్యం చేయకుండా పోలీసు అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి న్యాయాధికారులతో సమన్వయం చేస్తూ బాధితులకు న్యాయం



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

చేకూరేలా పనిచేయాలన్నారు. ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులను గుర్తించి వారితో కఠినంగా వ్యవహరించాలన్నారు. నిషేధిత గంజాయి, రేషన్ బియ్యం అక్రమ రవాణా, జూదం లాంటి కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠినచర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా గంజాయి రవాణా చేసే వ్యక్తులతో పాటు గంజాయిని సేవించే వారిని గుర్తించి కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటి నివారణకు సంబంధిత అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించకుండా మద్యం సేవించి వాహనాలను నడుపుతూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యే వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, మధుకర్, శ్రీలత, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం వీడాలి

చందుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం వీడాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి అన్నారు. చందుర్తి మండల ఎమ్మార్పీఎస్ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణను దేశంలోనే మొట్టమొదటిగా తెలంగాణలో అమలు చేస్తామని అసెంబ్లీ సాక్షిగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి వర్గీకరణ ఆలస్యం ఎందుకు చేస్తున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా తర్రె శంకరయ్య మాదిగ, ఉపాధ్యక్షులుగా కుంటాల అంజయ్య మాదిగ, ముదిగం పెళ్లి బాబు మాదిగ, అవునూర్ రాజు మాదిగ, ప్రధాన కార్యదర్శిగా లింగంపల్లి బాబు మాదిగ, కార్యదర్శుగా లింగంపల్లి శంకరయ్య మాదిగ, లింగాల రాజు మాదిగ, మల్యాల శ్రీనివాస్ మాదిగ, సంయుక్త కార్యదర్శి గస్కంటి శంకరయ్య మాదిగ, గద్దరాశి దేవయ్య మాదిగ, కట్కూరి స్వామి మాదిగ, ప్రచార కార్యదర్శిగా కుమ్మరి లక్ష్మణ్ మాదిగను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

సమానపనికి సమాన వేతనం చెల్లించాలి

సిరిసిల్ల రూరల్/కోనరావుపేట/వీర్నపల్లి నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ విద్యాలయాలతో పాటు సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులకు సమానపనికి సమానవేతనాలను అందించడంతోపాటు కేజీబీవీ విద్యాలయాల్లో చిల్డ్రన్ కేర్ టేకర్లను రాష్ట్రప్రభుత్వం నియమించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని కస్తూర్బా గాంధీ విద్యాలయంతోపాటు సర్వశిక్ష అభియాన్ ఉద్యోగులు గురువారం మధ్యాహ్నం భోజన విరామం సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ కేజీబీవీ, ఎస్ఎస్ఏ, యూఆర్ఎస్ ఉపాధ్యాయ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఏళ్ల తరబడి తక్కువ వేతనంతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయిస్తోందన్నారు. విద్యాలయాల్లో చిల్డ్రన్ కేర్‌టేకర్లను వెంటనే ప్రభుత్వం నియమించాలన్నారు. కోనారావుపేట మండల కేంద్రం, వీర్నపల్లి మండల కేంద్రంలోని కేజీబీవీలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి రాజు, జిల్లా కార్యదర్శి తిరుపతి జాదవ్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమాల్లో కేజీబీవీ, సీఆర్‌పీ ఉద్యోగులు ఇప్పపూల దేవేందర్, చందన్, నరేష్, సలీం, వెన్నెల తదితరులు పాల్గొన్నారు.



పెద్దూర్ కేజీబీవీ ఎదుట నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సను సద్వినియోగం చేసుకోవాలి: డీఎంహెచ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ వసంతరావు

సిరిసిల్ల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉచిత కుటుంబ నియంత్రణ కోత కుట్లులేని(వేసక్టమి)శస్త్ర చికిత్సను పురుషులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వసంతరావు సూచించారు. గురువారం సిరిసిల్ల పట్టణం ఐఎంఏ కార్యాలయంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వ్యాధి నిరోధక టీకాలు, ఏఈఎఫ్ఐలపై డాక్టర్ అతుల్, డాక్టర్ జోష్నా, డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లా వైద్య ఆరోగ్య శాక ఆధ్వర్యంలో శుక్రవారం, శనివారం వేములవాడ ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాల్లో, సిరిసిల్ల పట్టణం పీఎస్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో, డిసెంబరు 1న గంభీరావుపేట ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాంలో, 2న వేములవాడ ప్రాంతీయ ఆరోగ్య కేంద్రంలో, 3న సిరిసిల్ల పీఎస్‌నగర్ ఆరోగ్య కేంద్రంలో, 4న ఎల్లారెడ్డిపేట, వేములవాడ ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాల్లో పురుషులకు వేసెక్టమి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తామన్నారు. కుష్టు వ్యాధి నియంత్రణలో భాగంగా ఎల్‌సీడీసీ ఇంటింటి సర్వేలను డిసెంబరు 2న, 15న ఉదయం 6.30 నుంచి ఉదయం 8.30వరకు ఆశాలు నిర్వహిస్తారని అన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, ఆశాలు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల సముదాయంలో తొలగిన కంపు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



మురుగు నీటి కాల్వను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల సముదాయంలోని మురుగు నీటి కాల్వ కంపు తొలగింది. ఇళ్ల సముదాయాల్లో నెలకొన్న సమస్యలపై ఈ నెల 28న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'డబుల్ ఇళ్ల సముదాయాల్లో సమస్యలు' కథనానికి ఎంపీడీవో సత్తయ్య గురువారం స్పందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. లీకవుతున్న తాగునీటి ట్యాంకుల కు మరమ్మతులు చేయాలని పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌ను ఆదేశించారు. మురుగు నీటి కాల్వలను శుభ్రం చేయించారు. కాలనీవాసులకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు.

పశువుల తొట్టి.. శుభ్రం చేసేదెప్పుడో?



పశువుల తొట్టిలో పేరుకుపోయిన నాచు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ గ్రామ శివారులోని గంగమ్మ ఆలయం వద్ద నిర్మించిన పశువుల తాగు నీటి తొట్టిలో నాచు పేరుకుపోయింది. కలుషిత నీరును తాగి పశువులు వ్యాధుల బారిన పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. కొంతకాలంగా పశువుల తొట్టిని శుభ్రం చేయకపోవడం వల్ల నాచు పట్టి సూక్ష్మక్రిములతో నిండిపోయిందని పేర్కొంటున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే శుభ్రం చేయించాలని రైతులు కోరుతున్నారు.

పోగొట్టుకున్న ఆభరణాలు అప్పగింత



ఆభరణాల బ్యాగ్‌ను బాధితురాలికి అప్పగిస్తున్న ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆటోలో ప్రయాణిస్తూ ఒక మహిళ తన హ్యాండ్‌బ్యాగ్ పోగొట్టుకోగా అందులో 10 తులాల బంగారు ఆభరణాలున్నాయని పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఆ బ్యాగ్‌ను వెదికిపట్టుకుని బంగారు ఆభరణాలతో సహా బాధితురాలికి అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన హీనా పర్వీన్ అనే మహిళ బుధవారం తన తల్లితో కలిసి కరీంనగర్ నుంచి ఆటోలో గ్రామానికి వెళ్లింది. ఈ సమయంలో తన హాండ్ బ్యాగ్‌ను ఆటోలోనే మరిచిపోయింది. కొద్దిసేపటి తరువాత తన హ్యాండ్ బ్యాగ్ కనిపించకపోవటంతో గంగాధర పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంటనే స్పందించిన ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి సిబ్బందిని అప్రమత్తం చేసి గాలింపు చర్యలు ప్రారంభించి, సైబర్ క్రైం పోలీసులు, సిబ్బందితో గంటల సమయంలోనే ఆటోను గుర్తించి హాండ్‌బ్యాగ్‌ను వెదికిపట్టుకున్నారు. 10 తులాల బంగారు ఆభరణాలు, మొబైల్‌ఫోన్‌లతో కూడిన హ్యాండ్ బ్యాగ్‌ను భద్రతంగా బాధితురాలికి అప్పగించారు. సత్వరమే స్పందించి, బంగారు ఆభరణాల బ్యాగ్‌ను భద్రంగా వెదికిపట్టుకోవటంలో కృషి చేసిన ఎస్‌ఐ నరేందర్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య, కృష్ణారెడ్డి, కానిస్టేబుల్ మాణిక్యరెడ్డి, ప్రదీప్‌లను కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ కేంద్రంలో సీపీ అభిషేక్ మొహంతి అభినందించారు. వారికి రివార్డులతోపాటు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

మృతదేహం లభ్యం

పెద్దపల్లిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో గురువారం మృతదేహం లభించినట్లు ఎస్సై లక్ష్మన్‌రావు తెలిపారు. స్థానికుల సమాచారంతో అక్కడికి వెళ్లి చూడగా మృతదేహం కుళ్లిపోయి ఉందని, బయటకు తీసి జేబులు తనిఖీ చేయగా ఆధార్‌కార్డు ఉందని తెలిపారు. ఆధార్‌కార్డులో ఉన్న చిరునామా బీహార్ రాష్ట్రంలోని నస్గండ్ రోతాస్‌కు చెందిన నందకిషోర్‌రాంగా గుర్తించారు. మృతుడు కాకీ కలర్ స్వెటర్, బ్లూజీన్స్ వేసుకొని ఉన్నాడు. మృతదేహాన్ని పెద్దపల్లి ప్రభుత్వాస్పత్రి మార్చురీలో ఉంచినట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం..

కోల్‌సిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని మున్సిపల్ జంక్షన్‌లోని డ్రైన్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని గురువారం గుర్తించారు. పెట్రోల్ బంక్, మున్సిపల్ కార్యాలయం మధ్యలో ఉన్న డ్రైన్‌లో మృతదేహం ఉంది. 35సంవత్సరాల వయసు గల వ్యక్తిదిగా భావిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వ్యవసాయ బావిలో గుర్తు తెలియని మృతదేహం

గొల్లపెల్లి, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి) గొల్లపల్లి మండలం చిల్వాకోడూరు గ్రామానికి చెందిన వ్యవసాయ భూమిలో గురువారం గుర్తుతెలియని మృత దేహాన్ని స్థానికులు గుర్తించారు. మృదతదేహం పూర్తిగా కుళ్లిన పోయి గుర్తు పట్టడానికి కూడా వీలు లేకుండా ఉన్నది. మృతుడి కుడి చేయి పై సౌజన్య అని పచ్చ బొట్టు ఉన్నది. మరో చేయిపై దిక్కులను సూచిస్తున్న పచ్చ బొట్టు ఉన్నది. కేసు నమోదు చేసుకొని సంఘటనా స్థలంలోనే పోస్ట్ మార్టం నిర్వహించినట్టు గొల్లపెల్లి ఎస్సై చిర్ర సతీష్ కుమార్ తెలిపారు.

యువకుడి మృతిపై విచారణ చేపట్టాలి

- ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

వీర్నపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్జనపల్లి గ్రామానికి చెందిన ఈశంపల్లి అశీష్ (19) అక్టోబరు 1న తన స్నేహితులతో కలిసి వీర్నపల్లి వైపు వెళుతుండగా అడవి పదిర గ్రామశివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పిగాయపడి అసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కాగా తమ కుమారుడిని స్నేహితులే గాయపర్చినట్లు అనుమానం వ్యక్తం చేస్తూ బాధితులపై చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి కనకయ్య ఎస్పీ అఖిల్‌మహజన్‌కు దరఖాస్తు ఇచ్చాడు. మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి అంబులెన్స్‌లో స్వగ్రామానికి గురువారం తీసుకరాగా సుమారు 300 మంది ప్రజాసంఘాల నాయకులు, గ్రామస్తులు అంబేద్కర్ విగ్రహం వద్ద అందోళన చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు మల్లారపు అరుణ్‌కుమార్, ఈశంపల్లి కొమురయ్య డిమాండ్ చేశారు. మృతదేహంతో కొద్దిసేపు నినాదాలు చేస్తూ అందోళన నిర్వహించారు. అక్కడే ఉన్న స్థానిక ఎస్‌ఐ ఎల్లాగౌడ్ యువకుడి కుటుంబసభ్యులు, గ్రామస్థులతో మాట్లాడి పోస్టుమార్టం నివేదిక అధారంగా బాధితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో అందోళన విరమించారు. అనంతరం మృతదేహాన్ని ఇంటికి తరలించి పోలీస్ బందోబస్తు మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

నలుగురు శిశువుల దత్తత

కరీంనగర్ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోని కరీంనగర్ శిశుగృహంలో పెరుగుతున్న నలుగురు శిశువులను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిల్లలు లేని దంపతులకు దత్తత ఇచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇద్దరికి మగ, ఇద్దరికి ఆడ శిశువులను దత్తతగా ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని అన్నారు. ఇందుకోసం జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం, భగత్‌నగర్, కరీంనగర్‌లో సంప్రదించాలని సూచించారు. రక్త సంబంధీకుల నుంచి చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలనుకునే వారు కూడా ఈ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, డిసిపివో పర్వీన్, పివో తిరుపతి, శిశు గృహ మేనేజర్ తేజస్వీ, ఔట్ రీచ్ వర్కర్ రమేశ్, సోషల్ వర్కర్ రాజేశ్ పాల్గొన్నారు.

● బాల్య వివాహ్ ముక్త్ భారత్ పోస్టర్ ఆవిష్కరణ :


బాల్య వివాహ్ ముక్త్ భారత్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 10 వరకు జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలన ప్రచారకార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని బాల్య వివాహాల నిర్మూలన అధికారులుగా ఉన్న ఆర్డీవో, తహసీల్దార్లు, సీడీపీవోలను ఆదేశించారు.

రాష్ట్ర స్థాయి క్రీడల ఏర్పాట్లను పరిశీలించిన డీఈవో

హుజూరాబాద్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ మైదానంలో శుక్రవారం నుంచి జరిగే రాష్ట్ర స్థాయి (ఎస్‌జీఎఫ్) అండర్-14 బాలుర, బాలికల హాకీ క్రీడలు జరిగే ఏర్పాట్లను జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో పీఈటీలు వేణుగోపాల్, సారయ్య, రవికుమార్, భాగ్యలక్ష్మి, అనిల్, శ్రీనివాస్, రేణుక, శేఖర్ పాల్గొన్నారు.

ఆటల్లో ఆణిముత్యాలు

● వాలీబాల్ క్రీడల్లో జూలపల్లి విద్యార్థుల సత్తా.. ● రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు..





జూలపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్ క్రీడలో సత్తా చాటుతున్నారు. మండల కేంద్రానికి చెందిన శ్రునిక్ అనే విద్యార్థి 2021లో పాఠశాలలో చదువుతున్న సమయంలో వాలీబాల్ సబ్‌జూనియర్ విభాగంలో జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచాడు. అలాగే గత ఏడాది మండలంలోని అబ్బాపూర్ గ్రామానికి చెందిన చక్రినాథ్‌గౌడ్ అనే విద్యార్థి అండర్ 17, శివక్రిష్ణ అనే విద్యార్థి అండర్ 14 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాపోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుకున్నారు. మండలానికి చెందిన మరికొంత మంది యువకులు వాలీబాల్ క్రీడలో రాణిస్తుండడంతో వారి తల్లిదండ్రులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రోత్సా హం అందిస్తే మరికొందరు విద్యార్థులు మరిన్ని విజయాలు సాధిస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతా..

టి. సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వాలీబాల్ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి మండ లానికి పేరు మంచి గుర్తిం పు తెస్తుండడం వారి తల్లిదండ్రులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులుగా మాకు సంతోషంగా ఉంది. రాబోయే రోజుల్లో మరికొందరు విద్యార్థుల ను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను.



సబ్‌జూనియర్ విభాగంలో జాతీయస్థాయిలో రాణించిన శ్రునిక్, రాష్ట్ర స్థాయిలో రాణించిన శివక్రిష్ణ, చక్రినాథ్‌గౌడ్

క్రికెట్‌లో రాణిస్తున్న రామగుండం విద్యార్థి

అంతర్గాం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని 20వ డివిజన్ ఏరియాకు చెందిన మహమ్మద్ తౌఫిక్ క్రికెట్‌లో రాణిస్తున్నాడు. గోదావరిఖనిలోని మైనారిటీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు ప్రోత్సాహంతో తౌఫిక్ నిజామాబాద్, వరం గల్‌లో జరిగిన పోటీల్లో అండర్-14 విభా గంలో ప్రతి భ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. అనంతరం హర్యానా, గోవా రాష్ట్రాలలో జరిగిన పోటీల్లోనూ రాణించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. 2022 నేపాల్‌లోని పొక్రా స్టేడియంలో ఆడి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. ప్రస్తుతం తౌఫిక్ ఐటీఐ చదువుతున్నాడు.





నేపాల్‌లో తౌఫిక్ అందుకున్న ప్రశంసా పత్రం

వేధింపులకు పాల్పడ్డ ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జగిత్యాల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలోని ఓ మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల మహిళా ఉపాధ్యాయురాలిపై వేధింపులకు పాల్పడిన వ్యవహారంలో అదే పాఠశాలకు చెందిన బాధ్యుడైన ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న తనపై అదే పాఠశాలకు చెందిన ఓ ఉపాధ్యాయుడు వేధింపులకు పాల్పడుతున్నాడని మూడు రోజుల క్రితం బాధితురాలు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. సంఘటనపై విచారణ జరపాలంటూ ఉన్నతాధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు డీఈవో సైతం విచారణ చేసి వివరాలను సేకరించారు. ఉపాధ్యాయురాలిని వేధింపులకు పాల్పడ్డట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో సదరు ప్రభుత్వ పాఠశాల సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బదిలీ

భగత్‌నగర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రీజియన్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత హైదరాబాద్ రీజినల్ మేనేజర్‌గా బదిలీ అయ్యారు. రంగారెడ్డి రీజియన్‌లో డిప్యూటీ రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్న బిరాజు పదోన్నతిపై కరీంనగర్ రీజినల్ మేనేజర్‌గా నియమితులయ్యారు. కరీంనగర్ జోన్ ఈడీగా పనిచేస్తున్న మునిశేఖర్ హైదరాబాద్ బస్‌భవన్‌కు బదిలీ అయ్యారు. సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్‌గా పనిచేస్తున్న ఖుస్రోషాఖాన్ కరీంనగర్ ఈడీగా పదోన్నతిపై బదిలీ అయ్యారు.

వ్యవసాయ కళాశాల విద్యార్థుల ధర్నా



ధర్నా చేసున్న విద్యార్థులు

తంగళ్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో సరైన వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల ప్రధాన ద్వారం ఎదుట విద్యార్థులు ధర్నాకు దిగారు. అధిక సంఖ్యలో వసతి గృహంలో విద్యార్థులను చేర్చుకోవడాన్ని నిరసిస్తూ గురువారం విద్యార్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ హాస్టల్‌లో లెక్కకు మించి విద్యార్థులను చేర్చుకోవడంతో తాము హాస్టల్‌లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. అధికారులు స్పందించి హాస్టల్ కష్టాలను తీర్చాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ విషయంపై కళాశాల అసోసియేట్ డీన్ శ్రీదేవిని వివరణ కోరగా విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే కళాశాలలో చదువుకుం టున్న విద్యార్థినులను చేర్చుకున్నట్లు తెలిపారు. విద్యార్థినుల రక్షణ కోసం తాత్కాలికంగా వసతి గదులు కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థినుల భద్రతా చర్యల్లో భాగంగా తప్పనిసరిగా హాస్టల్లో చేర్చుకోవాల్సి వచ్చిందన్నారు. త్వరలోనే విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

వెల్గటూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలం స్తంభంపల్లి, పాషిగామ గ్రామాల మధ్యన వరంగల్- రాయపట్నం రాష్ట్ర రహదారిపై గురువారం ఆరు ఆటో ఢీ కొన్న సంఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి.. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం స్తంభంపల్లి, పాషిగామ గ్రామాల మధ్య ఎదురెదురుగా వస్తున్న కారు, ఆటో ఢీకొట్టుకున్నాయి. ఈ సంఘటనలో ఆటో నుజ్జు నుజ్జు అయింది. ఆటోలో ప్రయాణిస్తున్న మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన ఇందారపు కిరణ్, మేడి శ్రీధర్, మేడి సతీష్, గోపతి కిషోర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. హుటా హుటిన క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాటన్ పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర అధ్యక్షుడు మల్లేశం

సిరిసిల్ల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కాటన్ పరిశ్రమపై దృష్టి పెట్టి కార్మికులకు ఉపాధి కల్పించాలని ఏఐఎఫ్‌టీయూ(న్యూ)రాష్ట్ర అధ్యక్షుడు మోడం మల్లేశం అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం శాంతినగర్ ఆదర్శ పద్మశాలి సంఘం భవనంలో సిరిసిల్ల సైజింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐఎఫ్‌టీయూ) జిల్లా సర్వసభ్య సమావేశం యూనియన్ జిల్లా అధ్యక్షుడు వల్లాల కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ వస్త్ర పరిశ్రమ సంక్షోభంతో అనుబంధ పరిశ్రమ సైజింగ్ కార్మికులు ఉపాధిలేక అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం బతుకమ్మ చీరలపైనే శ్రద్ధ చూపడంతో కాటన్, పాలిస్టర్, సైజింగ్, డైయింగ్ పరిశ్రమలు కుదేలై ఉపాధి లేక కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాటన్ పరిశ్రమపై దృష్టి సారించి ఆర్డర్లు ఇచ్చి పరిశ్రమతో పాటు కార్మికులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం, తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, బి రవీందర్, సైజింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలిగేటి రాము, సహాయ కార్యదర్శి కూరపాటి సతీష్, నాయకులు కొమరయ్య, యూసుఫ్, మల్లేశం, చంద్రయ్య పాల్గొన్నారు.

జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు విద్యార్థి



షేక్ అఫాన్‌ను అభినందిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి

కరీంనగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి అండర్-19 కేజీఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు జిల్లా కేంద్రంలోని ట్రినిటీ జూనియర్ కళాశాల విద్యార్థి షేక్ అఫాన్ ఎంపికయ్యాడు. ఈ నెల 22న హైదరాబాద్‌లోని జింఖానా మైదానంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్-19 జూనియర్ కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విశేష ప్రతిభచాటి బంగారు పతకం సాధించిన షేక్ అఫాన్ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని ట్రినిటీ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అతనికి పుష్పగుచ్ఛాన్ని, ప్రశంసా పత్రాన్ని అందించి అభినందించారు. ట్రినిటీ సంస్థల వ్యవస్థాపకుడు దాసరి మనోహర్‌రెడ్డి ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలోని బుద్ధగయాలో ఈ నెల 29, 30, డిసెంబర్ 1న జరిగే జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభచాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పి శ్రీచరణ్ పటేల్, టి రణవీర్ రాజ్, పి సహన్, పి శ్రీహర్ష, వి యుక్తలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ముఫ్జిల్ తెలిపారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్ధన్ రెడ్డి తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు..

భీమారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో అథ్లెటిక్స్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని గోవిం దారం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన ఆకునూరి అశ్విత, భూపతి అవంతిక, తుమ్మ హర్షవర్ధన్‌లు జిల్లా స్థాయి జావెలన్ త్రో, 600 మీటర్లు, 400 మీటర్ల పరుగు పందెంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అష్రాఫ్ హుస్సేన్, వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రశాంత్ అభినందించారు.

రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలకు సైనిక్ స్కూల్ విద్యార్థులు

చొప్పదండి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్ విద్యార్థులు రిశ్వంత్, హర్షిత్, తేజేశ్వర్ జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలలో ప్రతిభ చాటి డిసెంబరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కల్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ శ్రీకాళహస్తి, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, ప్రమోద్ రాజు తదితరులు అభినందించారు.



ధర్మపురిలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



వేములవాడలో రాజన్నకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

ఆలయాల్లో భక్తుల రద్దీ

- ధర్మపురిలో 27వ రోజు గోదావరి హారతి
- వేములవాడలో దీపాలు వెలిగించిన మహిళలు

ధర్మపురి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి, వేములవాడ ఆగయాల్లో కార్తీకమాసం సందర్భంగా గురువారం సందడి నెలకొంది. ధర్మపురి క్షేత్రంలో గురువారం భక్తుల సంఖ్య పెరిగింది. లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. గోదావరి నదిలో కార్తీక స్నానాలు చేసిన భక్తులు, గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. మహిళలు భక్తి శ్రద్ధలతో పూజించి దొప్పల్లో కార్తీక దీపాలు ఉంచి, గోదావరి నదిలో వదిలారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించారు. స్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ నిత్య పూజలు, అభి షేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 27 వ రోజు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, వెంటరాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం విశేష పూజలు నిర్వహించి నదీ మాతకు హారతి ఇచ్చారు.

రాజన్న ఆలయంలో ..

వేములవాడ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి ఆయా క్యూలైన్ ద్వారా ఆలయంలోకి చేరుకున్నారు. రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుని తరించారు. ఆలయ ఆవరణలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు.

● వేములవాడ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న సామూహిక కార్తీక దీపోత్సవం వైభవంగా కొనసాగుతోంది. గురువారం రాత్రి ఆలయ కళావేదికలో సామూహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని ఆలయ సూపరింటెండెంట్ వరి నర్సయ్య జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులతో పాటుగా పట్టణవాసులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు ఓం, స్వస్తిక్, లింగాకృతిలో పూలతో అందంగా అలంకిరించి దీపాలను వెలిగించారు. కాగా కళావేదికలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



రాజన్న ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

రాంగ్ పార్కింగ్‌పై పోలీసుల కొరడా


లాక్‌చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

సిరిసిల్ల క్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో వాహనాల రాంగ్ పార్కింగ్‌పై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపిస్తున్నారు. ట్రాఫిక్ ఎస్ఐ రమేశ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా, గాంధీచౌక్, నేతన్నచౌక్ తదితర ప్రాంతాల్లో రహదారులపై పార్క్‌చేసిన వాహనాలకు లాకింగ్ చేశారు. ప్రతీ వాహనానికి జరిమానా విధించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో దివ్యాంగుల ప్రతిభ


అవార్డు అందుకుంటున్న క్రీడాకారులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వికలాంగుల క్రీడల పోటీల్లో జగిత్యాల జిల్లాకు చెందిన వికలాంగ క్రీడాకారులు సత్తాచాటారని జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేష్ తెలిపారు. కో రుట్లకు చెందిన రజినీ అనే దివ్యాం గురాలు క్యారం పోటీల్లో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి గెలుచుకోగా, వెల్లటూర్‌కు చెందిన పవన్‌కళ్యాణ్ రన్నింగ్, షాట్‌పుట్‌లో ద్వితీయ బహుమతి పొందినట్లు పేర్కొన్నారు. వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ చేతుల మీ దుగా బహుమతులు పొందారని తెలి పారు. క్రీడాకారులను కలెక్టర్ సత్యప్ర సాద్ అభినందించారు.

బోనాల ఉత్సవాల్లో గుండెపోటుతో వ్యక్తి మృతి


గంగాధర్(ఫైల్)

రాయికల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో బోనాల ఉత్సవాల్లో విషాదం నెలకొంది. గురువారం గ్రామంలో పోచమ్మ బోనాలు నిర్వహిస్తుండగా పోతురోజు నృత్యం చేస్తున్న బోదనపు గంగాధర్ (58) అకస్మాత్తుగా గుండె పోటుకు గురయ్యాడు. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు.



‘హత్య జరిగింది.. నిందితులు పారిపోయారు. క్లూస్ టీం వచ్చింది.. ఎటువంటి ఆధారాలు లభించలేదు.. ఈ సమయంలో వస్తుంది.. డాగ్‌స్క్వాడ్.. సంఘటన స్థలాన్ని పరిశీలించి వాసన పసిగట్టి నేరస్థులు ఏ మార్గంలో వెళ్లారు.. ఎక్కడెక్కడ తిరిగారు.. లాంటి ఆధారాలను విచారణ అధికారులకు అందజేస్తుంది. ఇలా కీలక కేసులలో పోలీసులకు సహాయం చేస్తున్న పోలీస్ డాగ్స్‌పై ‘ఆంధ్రజ్యోతి’ ప్రత్యేక కథనం..’





పవర్ ఫుల్ పోలీస్ డాగ్స్

● ఎనిమిది నెలల కఠోర శిక్షణ ● శాంతి భద్రతల రక్షణలో తమదైన పాత్ర

కరీంనగర్ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పోలీస్ డాగ్ స్క్వాడ్.. అంటే ప్రతి ఒక్కరికీ ఆసక్తి ఉంటుంది. పోలీసులకు నేరాల ఛేదనలో సహాయకారిగా ఉండే జాగిలాలకు ఎనిమిది నెలల కఠిన శిక్షణ ఇస్తారు. రాష్ట్రంలో హైదరాబాద్‌లోని మొయినా బాద్‌లో పోలీస్ డాగ్స్‌కు శిక్షణ ఇస్తున్నారు. తమకు అవసరమైన జాగిలాల గురించి ఆయా యూనిట్ల అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపిస్తారు. ఇంటలిజెన్స్, సెక్యూరిటీ వింగ్ అధికారుల ఆధ్వర్యంలో ఆయా యూనిట్లకు కావాల్సిన కుక్కలను (స్నిఫర్ లేదా ట్రాకర్) తీర్చిదిద్దేందుకు మూడు నెలల వయస్సు కలిగిన కుక్క పిల్లలను అందుబాటులోని కేంద్రాల్లో కొనుగోలు చేస్తారు. వాటిని హ్యాండ్లింగ్ చేసేందుకు ఏఆర్ కానిస్టేబుల్స్‌ను ప్రదిపాదిత అధికారులు హైదరాబాద్‌కు పంపిస్తారు. ఒక్కో హ్యాండ్లర్‌కు ఒక్కో జాగిలం బాధ్యతను అప్పచెబుతారు.

మొదటి నెలలో గ్రూమింగ్, వేళకు ఆహారం ఇవ్వడం ద్వారా హ్యాండ్లర్ పై కుక్కకు ప్రేమ, ఆకర్షణ కలిగేలా చేస్తారు. ఈ సమయంలో కుక్క తన యజమానిని గుర్తించే స్థాయికి చేరుతుంది. నాలుగో నెల నుంచి ఐదో నెల వరకూ విధేయత, కూర్చోవడం, నిలబడడం, పడుకోవడం, సెల్యూట్ చేయడం వంటివి నేర్పిస్తారు. ఆ తర్వాత వాటికి ఉన్నతాధికారుల సమక్షంలో పరీక్ష నిర్వహిస్తారు. వీటిలో ఉత్తీర్ణత పొందిన వాటికి ఐదు నెలల పాటు బాంబులను కనిపెట్టడం, లేదా నిందితుల ఆచూకీని కనిపెట్టడం, ఇతర అంశాల్లో పూర్తి స్థాయి శిక్షణనిస్తారు.

జాగిలాలను హ్యాండ్లర్లు కంటికిరెప్పలా చూసుకుంటారు. పొరపాటున ఒక కుక్క ఏదైనా కారణంతో మృతి చెందినట్లయితే హ్యాండ్లర్‌దే పూర్తి బాధ్యత ఉంటుంది. సంబంధిత హ్యాండ్లర్‌పై ఉన్నతాధికారులు కఠినచర్యలు తీసుకుంటారు. ఒక్కోసారి ఉద్యోగం నుంచి ఉద్వాసన పలకడంతోపాటు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

ప్రత్యేక సౌకర్యాలు

కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో పోలీసు డాగ్స్‌కు ప్రత్యేకంగా గదులను ఏర్పాటు చేశారు. వేసవి కాలంలో రక్షణ కోసం కూలర్లను కూడా ఏర్పాటు చేశారు. ప్రతి రోజు వేడి నీళ్లతో స్నానం చేయిస్తారు. ఒక్క పూటకు 250 గ్రాములు వంతున రెండు పూటలు రాయల్‌కెనాన్ ప్రత్యేక ఫీడ్‌ను ఆహారంగా అందిస్తారు. ఇందులో చికెన్, మటన్ మిశ్రమం ఉంటుంది.

మావోయిస్టు ప్రభావం ఉన్నప్పుడు..

జిల్లాలో గతంలో మావోయిస్టుల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న సమయంలో పోలీసు సిబ్బంది ప్రాణాలు కాపాడుకోవటానికి పోలీస్ డాగ్స్ కీలకంగా పనిచేశాయి. అటవీ ప్రాంతాల్లో నక్సల్స్ ఎక్కడ మందు పాతరలు పెట్టారో... ఎక్కడ జిలెటిన్‌స్టిక్స్‌ను భద్రపరిచారో కనుక్కోవడంలో డాగ్స్ కీలక పాత్రను పోషించాయి. అనంతరం పలు కేసు ఛేదనలో తమ వంతు ప్రాతను పోషిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం టైగర్, డాని, రాంబో, మిక్కీ, లియోలు, టైసన్ అనే 6 జాగిలాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో మూడు ట్రాకర్స్ రెండు ఎక్స్‌ప్లోజివ్ స్నిఫర్ డాగ్స్, ఒకటి నార్కోటిక్ స్నిఫర్ డాగ్ వీటికి ఆరుగురు శిక్షణ పొందిన ఏఆర్ కానిస్టేబుల్స్ హ్యాండ్లర్స్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.



కేసుల ఛేదనలో మేటి

ఉమ్మడి జిల్లాలోని మారు మూల అటవీ ప్రాంతంలో నక్సల్స్ ఏరివేతకు కూంబింగ్‌కు వెళ్లిన అప్పటి పోలీసులకు ఒక అనుమానిత ప్రాంతంలో పేలుడు పదార్థాలను పోలీసుడాగ్ పసిగట్టడంతో పెను ప్రమాదం తప్పింది. - జిల్లాలో ఓ మహిళను గుర్తుతెలియని గొంతు నులిమి హత్య చేసి ఒంటిపైన ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకు పోయారు. వెంటనే రంగంలోకి దిగిన డాగ్‌స్క్వాడ్ సంఘటనా స్థలంలో వాసన పసిగట్టిన డాగ్ (విక్కీ) కొంత దూరంలో ఉన్న నిందితుడి ఇంటికి వెళ్లి బంగారు ఆభరణాలు దాచిపెట్టిన చోటును చూపించింది. దీంతో పోలీసులు ఇంటి యజమానిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. ఇలా జిల్లాలో ఎన్నో కేసులను డాగ్ స్క్వాడ్ సహాయంతో పోలీసులు ఛేదించారు.

ఎనిమిదేళ్లపాటు మాతోనే ఉంటాయి..

ఎలుక శంకర్, లియోడాగ్ హాండ్లర్



నాలుగు నెలల వయస్సు నుంచి ఎనిమిదేళ్ల వరకు మాతోటే జాగిలం చనువుగా ఉంటుంది కాబట్టి మా కుటుంబంలో ఒక సభ్యుడిగానే భావిస్తాం. నాలుగు నెలల నుంచి హ్యాండ్లర్‌తో ఎనిమిది నెలలపాటు కఠోర శిక్షణ ఉంటుంది. శిక్షణ అనంతరం ఏడాది వయస్సు న్న జాగిలాన్ని హ్యాండ్లర్‌తోపాటు జిల్లాకు కేటాయి స్తారు. హ్యాండ్లర్ బదిలీ అయితే జాగిలం కూడా బది లీ అవుతుంది. ఒక్కసారి జాగిలానికి హ్యాండ్లర్‌తో హాండ్లర్‌తో శిక్షణ ఇస్తే దాని ప్రాణం ఉన్నంతవరకు అతడితోనే ఉంటుంది. వేరొకరి మాట వినదు. మత్తు పదార్థాలు, ఎక్స్‌ప్లోజివ్స్, వ్యక్తుల చెమట వాసనను చూపిస్తూ జాగిలాలకు నెలకు ఒకసారి ట్రైనింగ్‌లో పరీక్షలు నిర్వహిస్తుంటాం.

ఉద్యోగ విరమణ

సాధారణంగా శునకాల జీవిత కాలం 12 నుంచి 14 సంవత్సరాలు. పోలీస్ జాగిలాలకు ఎనిమిదేళ్లు నిండగానే ఉద్యోగ విరమణ చేయిస్తారు. ఎందుకంటే ఈ వయసుకు వచ్చే సరికి జాగిలాలలో వాసన పసిగట్టే శక్తి తగ్గిపోతుంది. పేలుడు పదార్థాలను గుర్తించే జాగిలాలు సాధారణం కంటే 40 రెట్లు ఎక్కువగా వాసన పీల్చుతాయి. పదవీ విరమణ చేసిన పోలీస్ జాగిలాలను వాటి హ్యాండ్లర్స్‌కు అప్ప గించేవారు. ఒక వేళ వీటిని పెంచుకునేందుకు వారు సమ్మతించకపోతే జంతు ప్రేమికులు ముందుకు వస్తే పోలీసు ఉన్నతాధి కారులు అన్ని విధాల పరిశీలించాక వారికి అప్పగించే వారు. జంతు ప్రేమికులకు అప్పగించిన రెండు నెలల వరకు వాటి బాగోగులను, యజమానితో జాగిలాలు వ్యవహరిస్తున్న తీరును వాటి హ్యాండ్లర్లు తప్పనిసరిగా పరిశీలించేవారు.

ప్రస్తుతం పోలీసుశాఖనే జాగిలాల సంరక్షణ బాధ్యతను తీసుకుని మరణించేవరకు పోషిస్తోంది. శోధనకు వెళ్లిన సమయంలో పాలు, కొబ్బరినీరు అందిస్తారు. ప్రతి రోజు 45 నిమిషాల వాకింగ్, 30 నిమిషాల ఎక్సర్‌సైజ్ తప్పనిసరిగా నిర్వహిస్తారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జీవన్‌రెడ్డి

- అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదించిన టీపీసీసీ



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి పేరునే తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) మళ్లీ ప్రతిపాదించింది. గురువారం గాంధీభవన్‌లో కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఈ నాలుగు జిల్లాల పరిధి కలిగిన ఎమ్మెల్సీ స్థానానికి మార్చిలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో అభ్యర్థిగా ఎవరి పేరును ప్రతిపాదించాలనే దానిపై చర్చ జరిగింది. పలువురు నేతలు కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నా సిట్టింగ్ ఎమ్మెల్సీ సీనియర్ నేత టి జీవన్‌రెడ్డినే తిరిగి ఆ స్థానంలో పోటీకి నిలపాలని సమావేశంలో అభిప్రాయపడ్డారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని వెల్లడించారు. హై కమాండ్‌దే తుది నిర్ణయం అని చెబుతూనే జీవన్‌రెడ్డి పేరును ప్రతిపాదిస్తూ ఈ సమావేశంలో తీర్మానం చేశారు.

● అధిష్ఠానానికి వెళ్లిన ఒకే ఒక్క పేరు

కాంగ్రెస్ అభ్యర్థిత్వాన్ని విద్యావేత్త, అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ వి నరేందర్‌రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, మాజీ ఎమ్మెల్సీలు ఆర్ సత్యనారాయణ, నర్సారెడ్డి, వెలిచాల రాజేందర్‌రావు తదితరులు ఆశించారు. కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు బృందం ఈ అభ్యర్థులపై నియోజకవర్గ పరిధిలోని 42 అసెంబ్లీ సెగ్మెంట్లలో సర్వే నిర్వహించి అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి, ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ పేర్లను సిఫారసు చేసిందని ప్రచారం జరిగింది. ప్రస్తుతం టీపీసీసీ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ ప్రజాప్రతినిధులు, నేతల సమావేశం మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేరును మాత్రమే మళ్లీ సిఫారసు చేసింది. పార్టీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాల్సిందే.

పెన్షనర్లను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలి

- పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్


మాట్లాడుతున్న హరి అశోక్‌కుమార్

కోరుట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు వి ధించిన ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలని పెన్షనర్ల రాష్ట్ర కా ర్యదర్శి హరి అశోక్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో పెన్షనర్ల సంఘ సర్వసభ సమావేశంలో పాల్గొన్ని మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నా రు. కేంద్రంలో పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని పార్లమెంట్ శీతాకాల సమావేశంలో గౌరవ భృతిగా ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌పై ఆదాయపు పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదాయపు పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేసేందుకు తీర్మానం చేసినట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఈ కా ర్యక్రమంలో గాజుల నర్సయ్య, పబ్బా శివానందం, గంటేడి రాజ్ మోహన్, నల్ల లక్ష్మినారాయణ, ఎండి సైఫొద్దిన్, హన్మంత రెడ్డి, వేల్పుల ప్రకాశ్ రా వు, చిటుక గంగారాం, సబిత రాజయ్య, మల్కయ్య, లక్ష్మీకాంతం, శ్రీరాములులతో పాటు పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రహదారి విస్తరణ కొలతలు


వేములవాడలో ఓ దుకాణంలో కొలతలు వేస్తున్న అధికారులు

వేములవాడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని ప్రధాన రహదారి విస్తరణ కోసం కొలతల సేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. రెవెన్యూ, ఇంజనీరింగ్, మున్సిపల్, సర్వే విభాగాలకు చెందిన 16 మందితో కూడిన నాలుగు బృందాలు రెండురోజులుగా ప్రధాన రహదారిలోని నివాసాలు, దుకాణాల కొలతలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో వేసిన కొలతలు అంచనాలతో సరి చూసుకుంటూ సర్వే నిర్వహిస్తున్నారు. వారం రోజుల్లో కొలతల సేకరణ మొత్తం ప్రక్రియ పూర్తి చేసి రెవెన్యూ అధికారులకు నివేదిక సమర్పిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐలు నవీన్‌కుమార్, మధు, సర్వేయర్లు మధుసూదన్, చామంతి, ఏఈలు గోవింద్, నర్మద, మయూరి తదితరులు ఉన్నారు.

గోదావరికి మహా హారతి


గోదావరినదికి హారతి ఇస్తున్న ఉత్సవ సమితి

కళ్యాణ్‌నగర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద పుష్కరఘాట్ నుంచి గోదావరినదమ్మ తల్లికి బుధవారం రాత్రి నక్షత్ర హారతి ఇచ్చి సారె సమర్పించారు. ఈ కార్యక్రమం హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కోకన్వీనర్ క్యాతం వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్యాస జయశ్రీ, ఒజ్జల వెంకటేశ్వర్లు, వైద్యులు లక్ష్మీవాణి, రమ్య, విశ్వహిందు పరిషత్ నాయకులు ఇస్సంపల్లి వెంకన్న, కృష్ణమూర్తి, గుండా మంజుల, భాగ్యలక్ష్మి, రజిత, కృష్ణప్రియ, పద్మ, వీరేశం, అశోక్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 11 మందికి జరిమానా, జైలుశిక్ష

పెద్దపల్లిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యో తి): డ్రంకెన్‌డ్రైవ్ కేసులో 11 మందిని గురువారం పెద్దపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ కోర్టులో హాజరుపరిచారు. జడ్జి మంజుల విచారించి రూ.11వేల 400 జరిమానా విధించారు. సు ల్తానాబాద్ మండలం కనుకుల గ్రామానికి చెంది నీరెళ్లి సతీష్‌కు మూడు రోజులు, మంచి ర్యాల జిల్లా హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన మొగుళ్ల సంతోష్‌కు రెండు రోజులు, పెద్దపల్లి పట్టణం ఉదయ్‌నగర్‌కు చెందిన ఎలుకపల్లి సతీష్‌కు రెండు రోజులు జైలుశిక్ష విధించారు.

హెల్మెట్ ధరించి.. అవగాహన కల్పించి..

- రోడ్డు భద్రత నియమాలపై విద్యార్థుల ప్రదర్శన


హెల్మెట్లు ధరించి అవగాహన ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం హెల్మెట్ ధరించి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. గ్రామ శివారులోని పాఠశాల నుంచి కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారి గుండా తహసీల్, ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, కొత్త, పాత బస్టాండుల మీదుగా అవగాహన ప్రదర్శన నిర్వహించారు. తమ ఆటాపాటల ద్వారా చైతన్యం నింపారు. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు అహల్యాబాయి కృషి


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అప్పాల ప్రసాద్, నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అహల్యాబాయి హోల్కర్ 18వ శతాబ్దం లో మహిళా సాధికారత కోసం ఎనలేని కృషి చేశారని అఖిల భారత సమరసతా కళా విభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. అహల్యాబాయి హోల్కర్ జయం తి వేడుకలను పురస్కరించుకొని సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో ముద్రించిన ఆమె జీవిత చరిత్ర పుస్తకాన్ని అప్పాల ప్రసాద్, నాయకులు గురువారం పట్టణంలో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యుడు సురేంద్రబాబు, సమరసతా వేదిక సభ్యులు భాస్కర్, రవి, రమేష్‌చారి, సంతోష్, పవన్, కరుణాకర్ పాల్గొన్నారు

ప్రమాదకరంగా మూలమలుపులు

- రాకపోకలకు వాహనదాల ఇబ్బందులు


కుస్తాపూర్ శివారులో ప్రమాదకర మూలమలుపులు


ప్రమాదకర మూలమలుపు

మల్లాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని ఆయా గ్రామాల శివారులో పలుమూల మలుపులు ప్రమాదకరంగా మారాయి. రహదారికి ఇరువైపులా ములుపులు అందులోనూ రహదారికి ఇరువైపులా మొక్కలు పెరిగి ఎదురుగా వస్తున్న వాహనాలు దగ్గరికి వచ్చేంతవరకు తెలియక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరి కొందరు మూల మలుపులపై అవగాహన లేక ప్రమాద బారినపడి ఆసు పత్రుల పాలవుతున్నారు. ముత్యంపేట, కు స్తాపూర్, రాఘవపేట, గుండంపల్లి, రేగుంట, ధాం రాజుపల్లి, వివిరావుపేట, తదితర గ్రామాల శివారులో ఉన్న మూల మలుపులపై అధికారులు చర్యలు తీసుకో వాలని వాహనచోదకులు కోరుతున్నారు.

గ్రామాల్లో కోతుల స్వైర విహారం

- మనుషులపై దాడి - ఇళ్లపై గూనపెంకులు ధ్వంసం - భయభ్రాంతులకు గురువుతున్న ప్రజలు


సైదాపూర్‌లో వీధుల్లో తిరుగుతున్న వానరాలు

సైదాపూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాలలో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. మనుషులపై దాడి చేస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతు న్నారు. వానరాలు గుంపులు గుంపులుగా గ్రామాల్లో చేరి ఇళ్లపై గూనపెంకులు ఊడబెరుకుతున్నాయి. నీళ్ల పైపులను విరగ్గొడుతున్నాయి. తలుపు తీసి ఉంటే చాలు.. ఇళ్లలోకి చేరి వంట సామగ్రిని చిందవందర చేస్తున్నాయి. పత్తి, మొక్క జొన్న పంటలను నాశనం చేస్తున్నాయి. పత్తి కాయలు తెంపి పడవేస్తూ, మొక్కజొన్న కంకులు విరుస్తూ నష్టం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లపై ఉంటూ అకస్మాత్తుగా దాడి చేస్తున్నాయని, చిన్న పిల్లలను నమ్మి బయట వదిలే పరిస్థితి లేదని మహిళలు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కోతుల బాధ నుంచి రక్షించాలని కోరుతున్నారు.

● అధికారులు చర్యలు తీసుకోవాలి



మండల కేంద్రంతో పాటు చాలా గ్రామాల్లో కోతుల బెడద ఉంది. అవి చిన్నపిల్లలు, పెద్దవారు అని చూడకుండా దాడి చేస్తున్నాయి. కట్టె చేతులో లేకుండా బయటకు వెళ్లే పరిస్థితి లేదు. వానరాలు గుంపులు గుంపులుగా వచ్చి ఇళ్లలో చేరి భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుని కోతుల బెడద నుంచి రక్షించాలి.

- గాదపాక కుమార్‌రాజా, సైదాపూర్

● గుట్టల ధ్వంసంతో జనాల్లోకి కోతులు

ఒకప్పుడు గుట్టలు చెట్లతో, పండ్లు ఫలాలతో పచ్చ గా ఉండేవి. కోతులతో పాటు అడవి జంతువులు ఆ గుట్టలను నివాసంగా చేసుకుని జీవించేవి. క్వారీలు ఏర్పరడడంతో చెట్లే కాదు.. గుట్టలూ కనుమరుగవుతున్నాయి. దీంతో అక్కడ నివసించే జీవులు చెల్లాచెదరైపోయాయి. కోతులు గ్రామాల్లోకి చేరి హంగామా చేస్తున్నాయి.

న్యూస్ బాక్స్

మానసికోల్లాసం కోసం వన భోజనాలు

సిరిసిల్ల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల మానసికోల్లాసం కోసం సిరిసిల్ల ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో వన భోజనాలను ఏర్పాటు చేశామని డీపో మేనేజర్ ఏ అశోక్ అన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం ఆర్టీసీ డీపో ఆవరణలో కార్తీక మాసం వన భోజనాలను ఏర్పాటు చేశారు. అంతకు ముందు డిపోలోని కార్మికులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇంచార్జి రాజేశం, ఆఫీస్ సూపరింటెండెంట్ నక్క శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరిసిల్ల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల మున్సిపల్ పరిధి లోని 8వ వార్డు పెద్దూర్ గ్రామానికి చెందిన బోడ దివ్యకు 32,500 రూపాయలు, తిప్పవరం జ్యోతికి 25,000 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు కావడంతో అ చెక్కులను గురువారం వార్డు కౌన్సిలర్ చెన్నమనేని కీర్తికమలాకర్‌రావు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్, వార్డు అధ్యక్షుడు మంగ ప్రశాంత్, ఓబీసీ సెల్ పట్టణ ప్రధాన కార్యదర్శి సలేంద్రి వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

గంభీరావుపేట, నవంబరు 28: (ఆంధ్రజ్యోతి) మండలం నాగంపేట గ్రామంలో సామలేటి రాజేందర్-రూప దంపతుల కూతురు ఊషారాణి పెళ్లి ఖర్చుల కోసం సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాష్ట్ర పద్మశాలి సంఘం జాయింట్ సెక్రటరీ యెల్ల బాలకృష్ణ 5,016 రూపాయల ఆర్థిక సాయం గురువారం అందించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు మేర్గు నాగభూషణం, మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు యెల్ల దేవేందర్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం

సిరిసిల్ల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్ల పట్టణంలోని వంశీ ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత గుండె వైద్యశిబిరం నిర్వహించారు. 150 మందికి ఆసుపత్రి వైద్యుడు వంశీధర్‌గౌడ్ గుండె నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. మెడికవర్ ఆసుపత్రి సిబ్బంది మందులను అందించారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య

సిరిసిల్ల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పిలుపునిచ్చారు. సిరిసిల్ల పట్టణం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆగయ్య మాట్లాడారు. తెలంగాణ వచ్చుడో కేసీఆర్ చచ్చుడో నినాదాన్ని ఎత్తుకొని నాడు కేసీఆర్ నవంబరు 29న ఆమరణ నిరాహార దీక్షను పూనుకొన్నారని అన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించనున్న దీక్షా దివస్‌లో భాగంగా రాజన్నసిరిసిల్ల జిల్లాలో దీక్షా దివస్‌ను నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ప్రజాక్షేత్రంలో తిరస్కరించిన వారు కేసీఆర్, కేటీఆర్‌పై విమర్శలు చేస్తున్నారన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ను ఎంత తిట్టినా ప్రజలు వారిని పట్టించుకోరన్నారు. దేశంలో ఎన్ని పార్టీలు ఉన్నయో అన్ని పార్టీల్లోకి కటకం మృత్యుంజయం మారారని ఆరోపించారు. ముఖ్యమంత్రి ప్రాపకం పొంది ప్రభుత్వ విప్ అయిన ఆది శ్రీనివాస్ అభివృద్ధి ఫలాలను వేములవాడ ప్రజలకు అందించాలన్నారు. కేసీఆర్, కేటీఆర్‌పై అనవసరమైన ఆరోపణలు చేస్తే ప్రజలు మిమ్మల్ని ఛీత్కరించే రోజులు వస్తాయన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ వైస్ చైర్మన్ అడగట్ల మురళి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణారాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, మాజీ కౌన్సిలర్లు గుండ్లపెల్లి పూర్ణచందర్, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట(ఆంధ్రజ్యోతి): ఈ నెల 29న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తలపెట్టిన 'దీక్షా దివస్'ను విజయవంతం చేయాలని ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని తాజా, మాజీ జడ్పీటీసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో చేపట్టే దీక్షా దివస్‌కు నాయకులు, కార్యకర్తలు ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సెస్ డైరెక్టర్ కృష్ణహరి, నాయకులు నర్సింహారెడ్డి, సందీప్, వెంకటనర్సింహారెడ్డి, నర్సింలు, సుధాకర్‌రావు, సీత్యానాయక్, నర్సాగౌడ్, నాగరాజు, దేవరాజు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో అభివృద్ధి కుంటుపడిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం దీక్షాదివస్ సన్నాహక సమావేశం జరిగింది. కేసీఆర్ దీక్షచేయకపోతే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యేది కాదని ప్రజలందరికి తెలుసు అన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలోని అల్గునూరులో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో జరిగే దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ఒగ్గు నర్సయ్యయాదవ్, కట్ట వెంకటరెడ్డి, ఉడుతల వెంకన్న, కేవీఎన్‌రెడ్డి, మీసరగండ్ల అనీల్‌కుమార్, ఎంద్ర చందన్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 50 లక్షలతో ఐదు ట్రాక్టర్లు కొనుగోలు

సిరిసిల్ల టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలకు మరింత మెరుగైన పారిశుధ్య పనులను అందించేందుకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 50 లక్షల నిధులతో ఐదు ట్రాక్టర్లను కొనుగోలు చేశామని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి అన్నా రు. గురువారం సిరిసిల్ల పట్టణంలో మున్సిపల్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ఐదు ట్రాక్టర్లకు మున్సిపల్ చైర్‌పర్సన్ కళాచక్రపాణి, కమిషనర్ లావణ్య పూజలు నిర్వహించి, రిబ్బన్ కట్‌చేసి ట్రాక్టర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ చెత్త సేకరణకు కొత్తగా కొనుగోలు చేసిన ఐదు ట్రాక్టర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలు స్వచ్ఛత నియమాలను పాటిస్తూ సిరిసిల్ల పట్టణాన్ని స్వచ్ఛ సిరిసిల్లగా ఆదర్శవంతంగా నిలపాలన్నారు. వ్యాపారులు, గృహ యజమానులు తడి పొడి చెత్తను బహిరంగ ప్రదేశాల్లో, రోడ్లపై పడవేయకుండా మీ ఇంటి ముందుకు వచ్చే చెత్త సేకరణ వాహనాలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిల ర్లు వేముల వినయ్, లింగంపల్లి సత్యనారాయణ, భూక్య రెడ్డినాయక్, ఆకుల కృష్ణ, మున్సి పల్ డీఈ వాణి, శానిటరి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అర్బన్ బ్యాంక్ వైస్‌చైర్మన్ అడగట్ల మురళి సిబ్బంది పాల్గొన్నారు.

తులసీ దామోదరుల కల్యాణం

తంగళ్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రామాలయ మిత్రకమిటీ ఆధ్వర్యంలో తులసీ దామోదరుల కల్యాణం, కార్తీక వనభోజనాలు నిర్వహించారు. గురువారం తంగళ్లపల్లి లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో రామాలయ మిత్ర కమిటీ, భజన మండలి సభ్యులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.

డ్రైనేజీని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని 10వ వార్డులో సిరిగాధ రమేశ్, సిరిగాధ కిషన్ ఇళ్ల వద్ద నుంచి బచ్చు శ్రీనివాస్ ఇంటి వరకు సుమారు 100 మీటర్ల డ్రైనేజీని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో సత్తయ్యకు గురువారం ఫిర్యాదు చేశామని గ్రామస్థులు రమేశ్, కిషన్ తెలిపారు. పదేళ్లుగా వినియోగంలో ఉన్న మురుగు నీటి కాల్వను ధ్వంసం చేసి మట్టిని పూడ్చి వేశారని పేర్కొన్నారు. కాల్వను ధ్వంసం చేయడం వల్ల తమ ఇళ్ల నుంచి వచ్చే వృధా నీరు వెళ్లేందుకు ఇబ్బందిగా మారిందని చెప్పారు. స్థానిక పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండాపోయిందని వాపోయారు. ఇప్పటికైనా స్పందించి డ్రైనేజీని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకుని తమ మురుగు నీరు నిల్వ లేకుండా చూడాని కోరారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎనగల్ గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన పసుల రవి కుటుంబానికి వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సెస్ సంస్థ నుంచి మంజూ రైన ఐదు లక్షల రూపాయల చెక్కును అందజేశారు. గురువారం ఎమ్మెల్యే క్యాప్ కార్యాలయంలో మృతుడి తల్లి వెంకవ్వకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్, నాయకులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజనాలకు హాజరు..

వేములవాడ టౌన్ (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణానికి చెందిన ఆర్యవైశ్యులు కార్తీక వనభోజనాల కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని అగ్రహారం జోడాంజనేయస్వామి వారి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.

చలి లెక్క పక్కా

5వ పేజీ తరువాయి..

జిల్లాలో గురువారం నమోదైన ఉష్ణోగ్రతలు

మండలం	వేదర్ స్టేషన్	కనిష్టం	గరిష్టం
రుద్రంగి	మానాల	11.2	27.9
రుద్రంగి	రుద్రంగి	11.5	30.8
ముస్తాబాద్	నామాపూర్	11.5	32.4
వీర్నపల్లి	వీర్నపల్లి	11.9	33.7
తంగళ్లపల్లి	నేరేళ్ల	12.0	27.8
గంభీరావుపేట	గజసింగవరం	12.1	29.1
వేములవాడ రూరల్	మల్లారం	12.6	28.2
సిరిసిల్ల	పెద్దూర్	12.9	29.2
ముస్తాబాద్	అవునూర్	13.0	27.6
చందుర్తి	మర్రిగడ్డ	13.0	29.9
బోయినపల్లి	బోయినపల్లి	13.1	28.4
ఇల్లంతకుంట	పెద్దలింగాపూర్	13.7	28.1
ఇల్లంతకుంట	కందికట్కూర్	13.8	29.0
వేములవాడ	నాంపల్లి	13.9	28.2
వేములవాడ రూరల్	వట్టెంల	14.3	27.6
కోనరావుపేట	మర్తనపేట	14.3	29.4
ఎల్లారెడ్డిపేట	ఎల్లారెడ్డిపేట	14.6	28.5
సిరిసిల్ల	సిరిసిల్ల కలెక్టరేట్	14.7	27.7
ఇల్లంతకుంట	ఇల్లంతకుంట	15.4	28.8
కోనరావుపేట	నిజామాబాద్	14.2	28.0
సగటు ఉష్ణోగ్రత		11.2	33.7

ఎల్లారెడ్డిపేటలో అటోమేటిక్ వేదర్ స్టేషన్లు ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీజీడీపీఎస్) నిర్వహణలో జిల్లాల వారీగా సగటు ఉష్ణోగ్రతలు లెక్కిస్తుంది. ఉష్ణోగ్రతల్లో చలి తీవ్రతను బట్టి కనిష్టంగా నాలుగు డిగ్రీల వరకు ఉంటే రెడ్ అలర్ట్‌గా, వార్నింగ్ హెచ్చరికగా గుర్తిస్తారు. 4 నుంచి 10 కనిష్ట డిగ్రీలు ఉంటే ఆరెంజ్ అలర్ట్‌గా, 10 నుంచి 15 డిగ్రీలు ఉంటే ఎల్లో అలర్ట్‌గా ప్రకటిస్తారు. 15పైనా ఉంటే నోఅలర్ట్ జోన్‌లో ఉన్నట్లుగా ప్రకటిస్తారు. వేసవిలో అయితే ఉష్ణోగ్రతల్లో ఎండ తీవ్రతను బట్టి 45 డిగ్రీలు వస్తే హెచ్చరికగా 40-45 డిగ్రీలు వస్తే అప్రమత్తం, 35- 40 జాగ్రత్త, 35 ఉంటే హెచ్చరి కలేనిదానిగా గుర్తిస్తారు. ఉష్ణోగ్రత లెక్కలనుబట్టి ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేయడం, దానికి అనుగుణంగా చర్యలు చేపట్టడం చేస్తారు. దీనినిబట్టి ఉష్ణోగ్రత లెక్కల ఆధారంగా ప్రజలను అప్రమత్తం చేస్తారు.

స్టేషన్ల వారీగా ఉష్ణోగ్రతల నమోదు

- శ్రీనివాసచారి, సీపీవో, రాజన్నసిరిసిల్ల



జిల్లాలో 21 వేదర్ స్టేషన్ల ద్వారా ఉష్ణోగ్రతలు అన్‌లైన్‌లో నమోదవుతాయి. జిల్లా సగటు ఉష్ణోగ్రత మాత్రం రాష్ట్రస్థాయిలో టీజీడీపీఎస్ గణిస్తుంది. వేదర్ స్టేషన్ల ద్వారా కనిష్ట, గరిష్ట ఉష్ణోగ్రతల నమోదు, హెచ్చు తగ్గులను టీజీడీపీఎస్ వెబ్‌సైట్ ద్వారా చూడవచ్చు. చలి తీవ్రత ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తాము.

గురుకుల పాఠశాల తనిఖీ


ఆహార విభాగాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో

వేములవాడ, నవంబర్ 28 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలో మండల విద్యాధికారి బన్నాజీ గురువారం నాడు తనిఖీ నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లోని వసతి గృహాలలో కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సంఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలలలో గురువారం నాడు అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వేములవాడ పట్టణ పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాలలోని వంటగదిని, పరిసరాలను మండల విద్యాధికారి బన్నాజీ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, వాటి పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

కేసీఆర్ నగర్ కాలనీవాసుల నిరసన


నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

తంగళ్లపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రమేష్ చంద్ర ఆధ్వర్యంలో కేసీఆర్ నగర్ కాలనీ వాసులు దర్నాకు దిగారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని కేసీఆర్ నగర్ కాలనీ ప్రధాన ద్వారం ఎదుట గురువారం దర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రమేష్ చంద్ర మాట్లాడుతూ కాలనీ వాసులు ఓట్లు సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో ఉన్నాయన్నారు. కేసీఆర్ కాలనీని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి ఓటు హక్కు కల్పించే విధంగా ఉన్నతాధికారులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో గోవిందు లక్ష్మణ్, పులి నాగరాజు, హేమంత్, ఎండి బాబా, ముజ్జు, సతీష్ నాగనాథ్, సోహెల్ కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

తంగళ్లపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ జరుగుతున్నా ప్రభుత్వం మొద్దు నిద్ర వహిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో సుమారు 600 మంది విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురయ్యారన్నారు. విద్యార్థులు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం విజయోత్సవాలు జరుపుకోవడం దురదృష్టకరం అన్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మట్టే శ్రీనివాస్, నవీన్ , కోడం వెంకటేష్, ముద్దం అనిల్ గౌడ్, కోడి రోహిత్ సాయి, సామల సంపత్, నిఖిల్ , వినయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం




సిరిసిల్లలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు, వేములవాడలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల ప్రాణాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిరిసిల్ల పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట గురువారం రాత్రి ఏబీవీపీ ఆధ్వర్యంలో మరణించిన విద్యార్థులకు కొవ్వొత్తుతో నివాళుల్పం చారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో చనిపోతున్న విద్యార్థులతో పాటు ఫుడ్ పాయిజన్ ఘటనలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఫుడ్‌పాయిజన్ వల్ల ఎంతో మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు, విభాగ్‌లా ఫోరం కన్వీనర్ సామనపెల్లి ప్రశాంత్, రామకృష్ణ, అభిలాష్, కార్తీక్, ఈశ్వర్, ముఖేష్, భార్గవ్, మనోజ్, అభిరామ్, శశి, మోహన్, నవీన్, అక్షయ్ పాల్గొన్నారు.

అస్వస్థతకు గురికాకుండా చూడాలి

వేములవాడ/వేములవాడ టౌన్ (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు అస్వస్థతకు గురికాకుండా చూడాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ గురువారం నాడు వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులకు హాస్టళ్లలో నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో విద్యార్థులను పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. ఫుడ్ పాయిజనింగ్ ఘటనలపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి భరత్, ప్రభాస్, శివ సాయి, రొండి శేఖర్, జంగం రవి, మాసం విష్ణు, బండి శ్యాంసుందర్, మాసం అర్జున్, రొండ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల డీఎస్పీ కార్యాలయం మార్పు

- పాత జిల్లా పోలీసు కార్యాలయంలో సేవలు ప్రారంభం



సిరిసిల్ల క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పోలీసు సబ్ డివిజనల్ (డీఎస్పీ) కార్యాలయానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఎనిమిదేళ్ల తర్వాత ప్రభుత్వ భవనంలోకి మారింది. రంగులు వేసి నూతనంగా తీర్చిదిద్దారు. అద్దె భవనంలో ఉన్న రికార్డులు, ఫైల్స్, ఫర్నిచర్ తరలించారు. దీంతో గురువారం పాత జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ కార్యాలయ సేవలు ప్రారంభమయ్యాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంగా రూపాంతరం చెందిన క్రమంలో కొత్త బస్టాండ్ ప్రాంతం లోని ఓ అద్దె భవనంలో డీఎస్పీ కార్యాలయాన్ని అక్టోబరు, 2016లో ప్రారంభించారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్థు కలిపి వినియోగించిన సమయంలో ప్రతి నెలా 12,500 రూపాయలు అద్దె చెల్లించేది. ఆ తర్వాత డీఎస్పీ కార్యాలయాన్ని ఖాళీ చేయాలని యజమాని ఒత్తిడి తీసుకువచ్చారు. దీంతో పై అంతస్థు భాగాన్ని ఖాళీ చేసి గ్రౌండ్ ఫ్లోర్‌లోనే కొనసాగించారు. ఇందుకు ప్రతి నెలా రూ. 7500 అద్దె చెల్లించేది. ఎనిమిది సంవత్సరాలుగా సిరిసిల్ల పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. ఇటీవల జిల్లా పోలీసు కార్యాలయం నూతన బంగ్లాలోకి మారడంతో ఈ సమస్యకు తెరపడింది. దీంతో డీఎస్పీ కార్యాలయానికి వచ్చే ప్రజలకు వినియోగంగా ఉండనుంది. ప్రస్తుత డీఎస్పీ కార్యాలయం సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్, సిరిసిల్ల రూరల్ సర్కిల్ కార్యాలయానికి దగ్గర కానుంది.

మహాత్మా జ్యోతిబాఫూలేకు ఘన నివాళి



దుమాల, చందుర్తిలో పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిబా పూలే వర్ధంతి సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి వెనుకబడిన తరగతుల ప్రజల సంక్షేమానికి మహాత్మాజ్యోతిరావు పూలే చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలాస మల్లేశం, ఉపాధ్యాయులు నాగుల రమాదేవి, బొల్ల మంజుల, సామల రమాదేవి, గూడూరి రవికుమార్, పర్కాల రవీందర్‌గౌడ్, గంగా భవాని, సిరిపురం జ్యోతి, పల్లెవేణి ఐలయ్య, జంగిటి భానుచందర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వేములవాడ (ఆంధ్రజ్యోతి): వేములవాడ న్యూ అర్బన్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్కుర్తి లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు దుర్శేటి లక్ష్మీనారాయణ, బుడంగారి విజయ, అంగన్వాడి ఉపాధ్యాయులు లిక్కిడి మంజుల, విద్యార్థులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు దుమాల, వెంకటాపూర్, గొల్లపల్లి, గుండారం, తదితర గ్రామాల్లో మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆయా గ్రామాల్లో తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పలు గ్రామాల్లో జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అణగారిన వర్గాల్లో అక్షర వెలుగులు నింపిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన అంటరాని కులాలకు విద్యనందించేందుకు కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పులి సత్తయ్య, గొట్టె ప్రభాకర్, లింగంపెల్లి అజయ్ కుమార్, పోతరాజు శ్రీనివాస్, ఆదిమల్లయ్య, పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు

వేములవాడ రూరల్, నవంబరు28, (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగాయపల్లిలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ సీనియర్ నాయకుడు చింతలకోటి రామస్వామి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదులో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

'బీడీ కార్మికులను శ్రమ దోపిడీ చేస్తున్న యాజమాన్యాలు'

కోనరావుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికులను యాజమాన్యాలు శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి అన్నారు. మండలంలోని కనగర్తి గ్రామంలో బీడీ కార్మికుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. యాజమాన్యాలు ఆకు, తంబాకు పేరిట దోపిడీ చేస్తూ వారి శ్రమను దోచుకుంటున్నాయన్నారు. అలాగే కూలి కూడా సరిగా ఇవ్వడం లేదని ఆరోపించారు. అర్హులైన బీడీ కార్మికులందరికీ బీడీ పెన్షన్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎల్ జ్యోతి, లావణ్య తార, లావణ్య పద్మ, గంగవ్వ, లచ్చవ్వ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతిభను వెలికితీసేందుకే చెకుముకి టెస్ట్

సిరిసిల్ల రూరల్, నవంబరు 28 (అంధ్రజ్యోతి): విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు జనవిజ్ఞాన వేదిక అధ్వర్యంలో చేపట్టిన చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నామని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి మార్వాడి గంగరాజు, జిల్లా అధ్యక్షుడు సిలివేరి సంపత్‌కుమార్ తెలిపారు. సిరిసిల్ల పట్టణ రగుడు శివారులో రంగినే మోహన్‌రావు ఎడ్యుకేషన్ ట్రస్ట్‌లో గురువారం జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటి అధ్వర్యంలో జిల్లా స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్ట్‌లను జిల్లాలోని 13 మండలాల పరిధిలోని పాఠశాలలో చదువుతున్న 8, 9, 10వ తరగతిల్లోని 35 టీంలను ఎంపికచేసిన విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌లను నిర్వహించారు. ఈ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో ఎపింకైన విద్యార్థులకు మార్వాడి గంగరాజు ప్రశంసాపత్రాలను అందజేశారు. జిల్లాస్థాయిలో ఎంపికైన విద్యార్థులు డిసెంబరు 14, 15, 16తేదీల్లో ఆదిలాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేధిక గౌరవ అధ్యక్షుడు రంగినేని మోహన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పారం లక్ష్మీనారాయణ, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు చెన్నమాధవుని రామరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు ద్యావనపల్లి శ్రీహరి, గంప లక్ష్మీనారాయణ, మెడిపట్ల కిషన్,గొర్రె రాజలింగం, కులేరి ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

వేములవాడ(అంధ్రజ్యోతి) : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల విద్యార్థులు చెకుముకి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బన్నాజీ తెలిపారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ పరీక్షలో సీహెచ్ నందిని, ఎం. అర్చన, ఓ చరణ్ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని ఆయన తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.